ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
ఆదివారం 30 జూన్ 2024



హనుమకొండ హంటర్‌రోడ్డులో మెడికవర్ మల్టీ నేషనల్ ఆస్పత్రిని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని.. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన హైదరాబాద్ విశ్వనగరంగా గుర్తింపు పొందిందని, ఆ మాదిరిగానే వరంగల్‌నూ రూపుదిద్దుతామన్నారు. ప్రతీ పౌరుడికి హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి, యూనిక్ నెంబరుతో డిజిటల్ కార్డులు ఇచ్చి.. తద్వారా ఏ ఆస్పత్రిలోనైనా ఉచితంగా చికిత్స పొందేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. హెల్త్, ఎడ్యుకేషన్, ఎకో, టెంపుల్ టూరిజం అన్నీ ఒక వరంగల్‌లోనే అభివృద్ధి చేసుకునే అవకాశాలున్నాయన్నారు.





నగర అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి

నగర సమగ్రాభివృద్ధికి మాస్టర్ ప్లాన్

హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తాం

- ఇందుకు రూ.6,115కోట్లు అవసరమని అంచనా
- రింగ్ రోడ్డు, మామునూరు విమానాశ్రయానికి భూసేకరణ చేపట్టండి
- అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి డీపీఆర్ సిద్ధం చేయాలి
- నిమ్స్ తరహాలో ఎంజీఎంలో ఎన్‌వోసీల అమలుకు యోచన
- నగరాభివృద్ధిపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- వివిధ శాఖల అధికారులకు దశ దిశా నిర్దేశం
- నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరిక
- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సీఎం విస్తృత పర్యటన

సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి



హనుమకొండ కలెక్టరేట్‌లో మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రులు

హనుమకొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తామని, నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా మరో విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని, ఈ దిశగా తానే స్వయంగా ప్రత్యేక దృష్టి పెడతానని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం వరంగల్, హనుమకొండ జిల్లాల పర్యటనకు వచ్చిన ఆయన మధ్యాహ్నం 01.10 గంటకు హెలికాప్టర్‌లో గీసు కొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ ఫ్యాక్టరీకి చేరుకున్నారు. ఆ తర్వాత వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పను లను పరిశీలించి.. హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించిన అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరంగల్ నగరాభివృద్ధికి సంబంధించిన ఎనిమిది అంశాలపై మూడున్నర గంటల పాటు సుదీర్ఘంగా అన్ని విభాగాల అధికారులతో సమీక్ష జరిపారు. అయితే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నగర సమస్యలపై ఇంత సుదీర్ఘంగా సమీక్ష జరపడం ఇదే మొదటి సారి. ఈ సందర్భంగా ఆయన రింగ్ రోడ్డు నిర్మాణం, స్మార్ట్ సిటీ పనులు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, మామునూరు విమానాశ్రయం, కాళోజీ కళాక్షేత్రం, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, తదితర అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా నగరాభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారుల ను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నగర సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎప్పుడైనా తనను కలవవచ్చునని అన్నారు. ఈ క్రమంలో హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య రింగ్ రోడ్డుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. రెండు చోట్ల 13 కిలోమీటర్ల వరకు చేపట్టనున్న రింగ్ రోడ్డు నిర్మాణానికి తొలుత సత్వరమే భూసేకరణ చేపట్టాలని, ఆ తర్వాతే నిర్మాణ పనులను చేపట్టాలని, వరంగల్ నుంచి ఇతర జిల్లాలకు రవాణా సౌకర్యం మెరుగుపడేలా జాతీయ రహదారుల అనుసంధానాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వరంగల్‌లో కాలనీలు మునుగుతున్నాయని, ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టాలని, నాలాల ఆక్రమ ణపై దృష్టి సారించాలని అన్నారు. నాలాల్లో ఇసుక ఎప్పటికప్పుడు తొల గించాలని.. హైదరాబాద్ నగరంలో అవలంబిస్తున్న కొత్త పద్ధతులను వరంగల్‌లోనూ ప్రయోగించాలని

మిగతా 7వ పేజీలో..





టెక్స్‌టైల్ పార్కులో కంపెనీ ఛాయాచిత్రాన్ని పరిశీలిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంపై అధికారులతో మాట్లాడుతున్న సీఎం

ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

జనగామ రూరల్, జూన్ 29: ధరణి, ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా సంబంధిత ఆధికారులను ఆదేశించారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్‌ఏ) ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ హైదరాబాద్ నుంచి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఆదనపు కలెక్టర్లు, రెవెన్యూ ఆధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జనగామ నుంచి కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో పాటు సంబంధిత అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ధరణి దరఖాస్తులను త్వరతగతిన పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు సీసీఎల్‌ఏ కార్యదర్శికి కలెక్టర్ వివరించారు. అనంతరం కలెక్టర్ సంబంధిత ఆధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరణి, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యల పట్ల ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు కొమురయ్య, వెంకన్న, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిక పోటీలకు 40 మంది హాజరు



స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలో పాల్గొన్న విద్యార్థులు

జనగామ రూరల్, జూన్ 29: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతి ప్రవేశాల కోసం శనివారం జిల్లా కేంద్రం లోని మినీ స్టేడియంలో విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బి.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పోటీల్లో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారని, జిల్లా స్థాయిలో ఎంపికైన వారి జాబితా తర్వాత వెల్లడిస్తామని, వారు జూలై 11వ తేదీన హకీంపేటలో జరిగే రాష్ట్రస్థాయి ఎంపికలో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జనగామ కల్చరల్, జూన్ 29: విద్యుత్ లైన్ కింద చెట్ల కొమ్మలు తొలగించడం కారణంగా జనగామ పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్మల తొలగింపుతో పాటు మెయిన్ లైన్ మెయింటెనెన్స్, కొత్త పోల్స్ నిలబెట్టడం కారణంగా బాలాజీనగర్, విజయ ఫంక్షన్‌హాల్, కెనరా బ్యాంక్ బజార్, కెనరా బ్యాంక్ వెనుక ప్రాంతం, మహాకాయ చిట్‌ఫండ్, నేచురల్ ఆయిల్ కంపెనీ బజార్, జ్యోతి అపార్ట్‌మెంట్, ఎస్‌పీఆర్ స్కూల్, జీఎంఆర్ గార్డెన్ వెనుక వైపు, ఎల్లమ్మ గుడి, శుభం అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సహకార సంఘాలు ఆర్థిక మార్గాలను అన్వేషించాలి..

- రూ.2200 కోట్ల టర్నోవర్ లక్ష్యం
- రుణమాఫీ ద్వారా 78,432 రైతులకు లబ్ధి
- సి గ్రేడ్ సంఘాలు పోటీపడాలి
- డీసీసీ బ్యాంకు మహాజన సభలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

6



మాట్లాడుతున్న మార్నేని రవీందర్‌రావు

సహకార సంఘాలు ఆర్థిక మార్గాలను అన్వేషించాలి..

డీసీసీ బ్యాంకు మహాజన సభలో టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు


సభలో మాట్లాడుతున్న మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూన్ 29: డీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలోని సహకార సంఘాలు ఆర్థిక బలోపేత మార్గాలను అన్వేషించాలని తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు సూచించారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో రవీందర్‌రావు అధ్యక్షతన మహాజన సభ జరిగింది. సభలో బ్యాంకు లావాదేవీలు, అప్పులు, రుణాల మంజూరు, రికవరీ, భవిష్యత్తు ప్రణాళికలు, బ్యాంకు టర్నోవర్ లక్ష్యం తదితర అంశాలను ప్రస్తావించారు. మహాజన సభనుద్దేశించి మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ.. సహకార సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం అయితే సేవల విస్తరణ జరుగుతుందన్నారు. ఫలితంగా నూతనంగా ఏర్పర్చుకున్న ప్రగతి లక్ష్యాల సాధన జరుగుతుందన్నారు. సహకార సంఘాల పరిధిలోని రైతుల అవసరాలే కాకుండా ఆయా ప్రాంతాల్లోని ప్రజల అవసరాలను గుర్తించి ఆ మేరకు వ్యాపారాలు నిర్వహిస్తే ఆర్థిక ఫలితాలుంటాయన్నారు. ఎప్పటికప్పుడు ఆర్థికంగా జరుగుతున్న మార్పులను పరిశీలించుకొని ఆ మేరకు అయా ప్రాంతాల ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకొని సంఘాలు వ్యాపారాల నిర్వహణను విస్తరించుకోవాలని సూచించారు. సంఘాలు వ్యాపార నిర్వహణపై దృష్టి పెడితే అనేక మార్గాల్లో ఫలితాలను సాధించవచ్చన్నారు. విత్తనాలు, ఎరువుల విక్రయాలే కాకుండా గ్యాస్ ఏజెన్సీలు, మాల్స్ నిర్వహణ, జెనరిక్ మెడికల్ షాప్స్, పెట్రోలు పంపులు, ఫంక్షన్ హాల్స్ ఇలా ఎన్నో వ్యాపారానికి అనువుగా ఉంటాయన్నారు. వీటిని పరిశీలించి అధ్యయనం చేసి ప్రారంభిస్తే తప్పక ఫలితాలు ఉంటాయన్నారు. తద్వారా సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయన్నారు.

డీసీసీ బ్యాంకు టర్నోవర్ రూ.2200 కోట్ల లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. ప్రస్తుతం రూ.1930 టర్నోవర్‌ను సాధించినట్లు చెప్పారు. కమర్షియల్ బ్యాంకులతో పాటు రుణాల మంజూరులో బ్యాంకు పోటీ పడుతుందన్నారు. అన్ని వర్గాల వారికి రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రగతి సాధనలో భాగంగా 50 సహకార సంఘాలు ఆర్థికంగా వృద్ధి సాధించాయని, ఇంత సంఖ్యలో సంఘాలు బలపడడం ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే జరిగిందన్నారు. సి-గ్రేడ్‌లో ఉన్న సంఘాలు బి నుంచి ఏ, ఏ-1 స్థాయికి చేరాయని వివరించారు. అయితే ప్రస్తుతం సి-గ్రేడ్‌లో ఉన్న సంఘాలు కూడా తమ ఉన్నతిని పెంచుకొని పోటీతత్వాన్ని ప్రదర్శించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీసీసీ బ్యాంకు ద్వారా 78,432మంది రైతులకు లబ్ధి చేకూరనున్నట్లు రవీందర్‌రావు వెల్లడించారు. రుణమాఫీ ద్వారా ఉమ్మడి వరంగల్‌లో మొత్తంగా రూ.522కోట్ల రుణాలు మాఫీ కానున్నట్లు చెప్పారు. బ్యాంకు అధికారుల సమర్పించిన రైతుల రుణమాఫీ వివరాలను ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదించినట్లు చెప్పారు. ఇందులో లోపాలు తలెత్తితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని రవీందర్‌రావు స్పష్టం చేశారు.

అనంతరం బ్యాంకు ప్రగతి నివేదికను రవీందర్‌రావు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీసీసీ బ్యాంకు వైస్ ఛైర్మన్ కుందూరు వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్లు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, హరిప్రసాద్, మురళీధర్, రాజేశ్వర్‌రెడ్డి, రమేశ్, రంజిత్, గోపాలరావు, శ్రీనివాస్, రవిరాజా, నరేందర్, ప్రదీప్‌చందర్, డీసీసీ బ్యాంకు సీఈవో వాజిద్ సుల్తాన్, డీసీవోలు తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తాం..

రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు


మాడవీధుల ప్లాన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ హన్మంతరావు

వరంగల్ కల్చరల్, జూన్ 29: చారిత్రక ప్రసిద్ధిగాంచిన భద్రకాళి ఆలయ అభివృద్ధి, మాడవీధుల నిర్మాణ పనులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ మంత్రి ప్రగడ హన్మంతరావు అన్నారు. శనివారం వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ముందుగా కమిషనర్‌కు ఆలయ అర్చకులు, ఈవో శేష భారతి, ప్రధానార్చకుడు భద్రకాళి శేషు మంగళ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. కమిషనర్ గోశాలను సందర్శించి ఆదిశంకరాచార్యులు, వల్లభ గణపతిని దర్శించుకున్న అనంతరం భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మహా మండపంలో కమిషనర్ హన్మంతరావుకు ప్రధానార్చకుల ఆధ్వర్యంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రాలను బహూకరించి ప్రసాదాలు అందజేశారు.

అనంతరం రూ.30కోట్లతో భద్రకాళి ఆలయ అభివృద్ధి మాడవీధుల నిర్మాణ పనులపై ఆయన అర్చకులతో చర్చించారు. మాడవీధుల పనులు ప్రారంభం కాగా, భద్రకాళి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించామని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు వివరించారు. ఆలయ అభివృద్ధి కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను కమిషనర్ హన్మంతరావు పరిశీలించారు. ప్లాన్ ప్రకారం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇంకా ఆలయ అభివృద్ధికి అవసరమైన పనులు, నిధుల వివరాలతో నివేదిక సిద్ధం చేసి పంపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మాడవీధుల పనులను కమిషనర్ పరిశీలించారు. అన్నదాన సత్రం, వేద పాఠశాల భవనాలు, ఆలయానికి సంబంధించిన ఇతర నిర్మాణ పనుల వివరాలు కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. నాణ్యతలో ఎటువంటి రాజీలేకుండా పనులు చేపట్టాలని, మాస్టర్ ప్లాన్ ఆధారంగా పనులు పూర్తయ్యేలా ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీకాంత్‌రావు, సహాయ కమిషనర్ రాయల సునిత, మేడారం ఈవో రాజేంద్రం, ఇన్‌స్పెక్టర్లు సంజీవరెడ్డి, అనిల్, ఐఎన్‌పీఆర్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జగన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ శ్రీరాములు, డీపీఆర్‌వో కిరణ్మయి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతను జోడించి నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

ఎన్పీడీసీఎల్ ఉద్యోగులకు ట్రాన్స్‌కో సీఎండీ రోనాల్డ్ రోస్ పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న ట్రాన్స్ కో సీఎండీ రోనాల్డ్ రోస్

హనుమకొండ టౌన్, జూన్29: కొత్తగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎన్పీడీసీఎల్ ఉద్యోగులకు ట్రాన్స్‌కో సీఎండీ రోనాల్డ్‌రోస్ పిలుపునిచ్చారు. శనివారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలతో సీఎండీ రోనాల్డ్‌రోస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క ఉద్యోగి నైపుణ్యత, సామర్థ్యం పెంచుకోవాలని సూచించారు. వినియోగదారులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ వారధిలా నిలవాలన్నారు. నిబద్ధతతో పనిచేసి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు.

ఈ సందర్భంగా టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి డిస్కం గురించి రోనాల్డ్‌రోస్‌కు పూర్తిగా వివరించారు. కంపెనీ పరిధిలోని 16 సర్కిళ్ల పరిధిలో 67 లక్షల వినియోగదారులకు మెరుగైన సరఫరా అందిస్తున్నామని తెలిపారు. ఆపరేషనల్ స్ట్రక్చర్ గురించి ప్రస్తావిస్తూ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, డిస్ట్రిబ్యూషన్, సంస్థ మానవ వనరులు, సబ్‌స్టేషన్స్, స్కాడా గురించి వివరించారు. సంస్థను బలోపేతం చేయడంలో భాగంగా కొత్త సబ్‌స్టేషన్‌ల నిర్మాణం, 33కేవీ ప్రత్యామ్నాయ సరఫరా, పాత సబ్‌స్టేషన్‌ల పునరుద్ధరణ పనులను చేపడుతున్నట్లు వెల్లడించారు. వినియోగదారులకు మరింత చేరువయ్యేలా ప్రతి సోమవారం సెక్షన్‌ల నుంచి సర్కిల్ కార్యాలయాల వరకు విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నామన్నారు. విద్యుత్ బిల్లులపై క్యూఆర్ కోడ్ ముద్రించి అందిస్తున్నట్లు తెలిపారు. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకొని సబ్‌స్టేషన్ ఆటోమేషన్ చేపడుతున్నామన్నారు. అనంతరం సీఎండీ రోనాల్డ్ రోస్‌ను ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి మెమొంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, మోహన్‌రావు, తిరుపతిరెడ్డి, సిజియంలు తిరుమల్‌రావు, మధుసూదన్, కిషన్, రాజుచౌహాన్, కె.ఎన్.గుట్ట, రవీంద్రనాథ్, ట్రాన్స్ కో సీఈ పుల్లయ్య, రాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కు భూ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు

అధికారులకు ఆదేశాలిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి



టెక్స్‌టైల్ పార్కులో ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

గీసుగొండ, జూన్ 29 : కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు కోసం భూములిచ్చిన నిర్వాసితులకు వంద గజాల స్థలంలో అన్ని వసతులతో కూడిన ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గీసుగొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును శనివారం సీఎం రేవంత్‌రెడ్డి 50 నిమిషాల పాటు పరిశీలించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో వచ్చిన సీఎం టెక్స్‌టైల్ పార్కులోని యంగ్వాన్ కంపెనీ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు మధ్యాహ్నం 01.10 గంటకు చేరుకున్న ఆయన అక్కడి నుంచి బస్సులో కిలోమీటరు దూరంలో ఉన్న కైటెక్స్ కంపెనీ వద్ద ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమానికి 01.25 గంటలకు చేరుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం టెక్స్‌టైల్ పార్క్‌లో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. పార్కు స్థలం మ్యాప్‌తోపాటు ఏర్పాటవుతున్న కంపెనీల వివరాలు, ఉత్పత్తుల గురించి స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్‌రంజన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. ఈ క్రమంలో గతేడాది భారీ వర్షాల వల్ల పార్కు స్థలంలో 300 ఎకరాలు ముంపునకు గురై కైటెక్స్ కంపెనీ నిర్మాణ పనులు నిలిచి పోయాయని, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని కంపెనీ ప్రతినిధి మనోజ్ కుమార్ సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన సీఎం వరద ముంపును నివారించేందుకు 10 ఎకరాల్లో పాండ్‌ను నిర్మించి అందులోని నీటిని పరిశ్రమలకు ఉపయోగించుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలంలో పాండ్‌లో ఎక్కువైన నీటిని కాలువ ద్వారా సమీప చెరువులోకి పంపించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీజీఐఐసీ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా భూ నిర్వాసితులకు నీటి సరఫరా, రోడ్లు, విద్యుత్, డ్రెయినేజీ వంటి మౌలిక వసతులతో వంద గజాల ప్లాట్లు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్ల సబ్సిడీని కూడా అందించాలని కలెక్టర్‌కు సీఎం సూచించారు. అలా భూ నిర్వాసితులకు నిర్మించే కాలనీని మేజర్ గ్రామపంచాయతీగా గుర్తించి అన్ని వసతులను కల్పించాలన్నారు. భూ నిర్వాసితులకు ఇప్పటి వరకు 1200 ప్లాట్లు ఏర్పాటు చేశామని.. ఇంకా 150 మందికి ఇవ్వాల్సిన ప్లాట్లను పైలాన్ వద్ద సిద్ధం చేస్తున్నట్లు టీజీఐఐసీ అధికారులు సీఎంకు వివరించారు. అనంతరం 2గంటలకు ఎగ్జిబిషన్ హాల్ నుంచి బయటకు వచ్చిన సీఎంను కలిసేందుకు కాంగ్రెస్ నాయకులు పోటీపడ్డారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, ఎంపీ కడియం కావ్య, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ట్రాన్స్‌కో సీఎండీ రోనాల్డ్‌రాస్, ప్రిన్సిపల్ సెక్రటరీ హనుమంతు, సీఎంవో స్పెషల్ సెక్రటరీ అజిత్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, వరంగల్ కలెక్టర్ సత్యశారదాదేవి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్, ఎంపీపీలు భీమగాని సౌజన్య, కళావతి, సంగెం జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



మొక్కనాటుతున్న రేవంత్

మెడికవర్ ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం



సీఎంకు జ్ఞాపికను అందిస్తున్న మెడికవర్ ఆల్ ఇండియా చైర్మన్, డైరెక్టర్ అనిల్‌కృష్ణ

బాలసముద్రం, జూన్ 29: వరంగల్ నగరంలో అత్యాధునిక వసతులతో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు హంటర్‌రోడ్డులో ఏర్పాటు చేసిన మెడికవర్ సూపర్ మల్టీ స్పెషాలిటీ 300 పడకల ఆస్పత్రిని సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా 12 దేశాలలో కార్యకలాపాలు నిర్వహిస్తూ అత్యంత హెల్త్ కేర్ బ్రాండ్‌గా గుర్తింపుపొందిన మెడికవర్ ఆస్పత్రి 24వ బ్రాంచ్‌ను వరంగల్‌లో ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్వాహకులను అభినందించారు. సువిశాలమైన భవనంలో అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో వైద్య పరికరాలను సీఎం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని, మంత్రులను మెడికవర్ ఆల్ ఇండియా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు శరత్‌రెడ్డి, హరికృష్ణలు శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ అనిల్‌కృష్ణ మాట్లాడుతూ.. దేశంలో అగ్రగామి మల్టీనేషనల్ ఆస్పత్రి చైన్‌గా 24 ఆస్పత్రులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2015లో నలుగురితో ప్రారంభించిన మెడికవర్ ఆస్పత్రి.. లక్షల మందికి వైద్య సేవలందించిందన్నారు. కరోనా సమయంలో లక్షలాది మందికి ఉచితంగా వ్యాక్సినేషన్ అందించినట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం మెడికవర్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. హెల్త్ హబ్‌గా తీర్చి దిద్దేందుకు మెడికవర్ కలిసి పనిచేస్తుందని అన్నారు. వరంగల్‌లో 300 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 7 ఆపరేషన్ థియేటర్స్‌తో పాటు ఎక్కువ సంఖ్యలో ఐసీయూ బెడ్స్, ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు నగర ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. వరంగల్ నగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మెడికవర్ హాస్పిటల్ వరంగల్ నగరంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్.నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన సీఎం

హనుమకొండ కలెక్టరేట్, జూన్29: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు ఇటీవల శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మెప్మా ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్‌లో మహిళా సంఘం ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌ను శనివారం సీఎం రేవంత్‌రెడ్డి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం సభ్యులు సొంతంగా తయారుచేసిన పిండి వంటలను సీఎం రుచి చూసి అభినందించారు. మహిళా సం ఘాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తామని వారికి హామీ ఇచ్చారు. సీఎం వెంట మంత్రులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, దామోదర రాజనరసింహ, కొండా సురేఖ, సీతక్క, సీఎస్ శాంతికుమారి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, ఎమ్మెల్యేలు ఉన్నారు.

కుట్టుమిషన్ స్టాల్‌ను సందర్శించిన సీఎం

డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో మహిళా శక్తి పథకం కింద మహిళా సంఘాలకు కుట్టుమిషన్లు ఇచ్చారు. ఈ మహిళా సంఘాల సభ్యులు శనివారం కలెక్టరేట్‌లో స్టాల్ ఏర్పాటు చేయగా సీఎం రేవంత్ రెడ్డి స్టాల్‌ను సందర్శించి మహిళలతో మాట్లాడారు. యూనిఫాంలు కుట్టడంలో ఏమైనా ఇబ్బందులు ఎదు రయ్యాయా? మీరు ఎంతమందికి యూనిఫామ్స్ కుట్టారు? ఎలా అనిపించింది? దీనివల్ల లాభం ఉందా? ఆర్థికంగా నిల దొక్కుకున్నారా? ఎవరెవరు ఎన్ని కుట్టారు? అని సభ్యులతో సీఎం మాట్లాడారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల డీఆర్‌డీఓలు నాగ పద్మజ, కౌసల్యదేవి డీపీఎంలు జె.ప్రకాశ్, ఎం.అనిల్, ఎ.శ్రీకాంత్ కార్యక్రమంలో ఉన్నారు.



కుట్టుమిషన్ కేంద్రంలో మహిళలతో ముచ్చటిస్తూ..

సీఎం పర్యటన సాగిందిలా..

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 29: వరంగల్ మహానగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష చేయడానికి శనివారం సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పర్యటించారు. సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 1:16నిమిషాలకు వరంగల్ జిల్లా సంగెం మండలంలోని టెక్స్‌టైల్‌పార్కుకు చేరుకున్నారు. అక్కడ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం అక్కడి నుంచి 2:02 నిమిషాల కు బయలుదేరి 2:37 నిమిషాలకు వరంగల్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ ఆస్పత్రిని పరిశీలించి 2:52 నిమిషాలకు అక్కడి నుంచి బయలుదేరి 3:04 నిమిషాలకు హనుమకొండలోని కలె క్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రం 6:18 నిమిషాలకు బయలుదేరి హంటర్‌రోడ్‌లోని మెడికవర్ ఆస్పత్రికి 6:24నిమిషాలకు చేరుకున్నారు. అనంతరం అక్కడ ఆస్పత్రిని ప్రారంభిం చారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడి సీఎం రేవంత్‌రెడ్డి తిరిగి అక్కడి నుండి 7:12 నిమిషాలకు వెళ్లిపోయారు.

అంచనా వ్యయం పెంపుపై సీఎం ఆగ్రహం

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పరిశీలించిన సీఎం



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్లాన్‌ను పరిశీలిస్తున్న రేవంత్‌రెడ్డి

వరంగల్ మెడికల్, జూన్ 29: వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ అంచనా వ్యయం పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మధ్యాహ్నం వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను పరిశీలించిన ఆయన అధికారులతో మాట్లాడుతూ.. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం విషయంలో రూ.1100కోట్లున్న అంచనా వ్యయాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా రూ.1,726 కోట్లకు ఇష్టారాజ్యంగా ఎలా పెంచారని, కేవలం మౌఖిక ఆదేశాలతో రూ.626కోట్ల వ్యయం ఎలా పెంచుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి నిర్మాణ వ్యయంపై పూర్తిస్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా యుద్ధప్రాతిపదికన హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేయాల్సిందే నని నిర్మాణం సంస్థకు సీఎం తేల్చిచెప్పారు. ఆస్పత్రి అంతస్తుల వివరాలను రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ సీఎంకు వివరించారు. ఒకటి నుంచి 15 అంతస్తులు చికిత్స కోసమని, ఇందులో మూడు, నాలుగు ఫ్లోర్లు థియేటర్లు ఉంటాయని వివరించారు. అదే విధంగా 12, 13 ఫ్లోర్లలో లేబరోటరీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. 16, 17, 18 ఫ్లోర్లలో అకడమిక్ కార్యక్రమాలు కొనసాగుతాయని, 20, 21 ఫ్లోర్లలో సీనియర్ రెసిడెంట్లు ఉంటారని, 23వ ఫ్లోర్‌లో పరిపాలన భవనం ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనలకు లోబడి నిర్మాణం జరుగుతుందని, కాకతీయ వైద్య కళాశాల సూపర్ స్పెషాలిటీలో ప్రస్తుతం తొమ్మిది విభాగాల్లో ఐదు విభాగాలు కొత్త బ్లాక్‌లోకి వస్తాయని సీఎంకు తెలిపారు. సీఎం అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ నూతన ఆస్పత్రిలో సర్జికల్ గ్యాస్ట్రో, మెడికల్ జెనెటిక్స్, జీడియాట్రిక్స్, రుమటాలజీ, సర్జికల్ ఆంకాలజీ లాంటి ఎనిమిది కొత్త విభాగాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఎంజీఎం ఆస్పత్రిలో పీడియాట్రిక్ విభాగంతో పాటు మాతాశిశు సంరక్షణ విభాగం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ, రెవెన్యూ శాఖ మంత్రి పి.శ్రీనివాస్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

నగర సమగ్రాభివృద్ధికి.. మాస్టర్ ప్లాన్..



సమీక్షకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

(5వ పేజీ తరువాయి)

సూచించారు. నాలాలపై అక్రమ నిర్మాణాలు ఉంటే వెంటనే తొలగించాలని ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణంపై డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షం కురిసినప్పుడు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల అంచనాల వ్యయం ఎందుకు పెరిగిందని అధికారులను ప్రశ్నించారు. ఈపీసీ పద్ధతిన పనులు చేపడుతున్నందు వల్ల ఇలా పెంచే వీలు లేదని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల విలువ పెంపు అంచనాల పెంపుపై ప్రత్యేక నివేదిక తయారు చేయాలని ఆదేశించారు.

సమగ్ర వివరాలతో మాస్టర్‌ప్లాన్ రూపొందించాలి

2050 సంవత్సరం వరకు వరంగల్ అభివృద్ధికి సరిపడేలా సమగ్రమైన వివరాలతో మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. వరంగల్‌లో హైదరాబాద్‌లో ఉన్న నిలోఫర్ ఆస్పత్రి తరహాలో అన్ని హంగులతో ఓ ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మామునూరు ఏయిర్ పోర్టు నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ వెంటనే చేపట్టాలని, ఇందుకు అవసరమైన నిధులు కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుందో లేదో తెలుసుకోవాలన్నారు. అలాగే సెప్టెంబర్ 9 నాటికి కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని అధికారులను హెచ్చరించారు. అత్యవసర సమయాల్లో ఆపరేషన్లు, ఇతర వైద్య సేవలకు నిమ్స్‌లో అందిస్తున్నట్లుగా ఎంజీఎం ఆస్పత్రిలో ఎన్‌వోసీ ఇచ్చే అంశంపై పరిశీలన జరుపుతామన్నారు. ఎమర్జెన్సీ సమయంలో సర్జరీలు, వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, సిబ్బందికి తగిన పారితోషికం అందిస్తామని, స్వశక్తి మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రేవంత్ పేర్కొన్నారు. స్కూల్ విద్యార్థుల యూనిఫాంకు సంబంధించిన పెండింగ్ బిల్స్ ఉంటే వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. రాబోయే రోజుల్లో అన్ని ప్రభుత్వ శాఖల యూనిఫామ్‌లు కుట్టించే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించే అవకాశం ఉందని, ఈ విషయాన్ని చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలో వరంగల్ అభివృద్ధిపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం అన్ని వివరాలతో కూడిన ఒక ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ నగర అభివృద్ధికి రూ.6,115 కోట్ల నిధులు అవసరమని ప్రాథమికంగా గుర్తించామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయబోమని, సుపరిపాలన అందించితీరుతామని ముఖ్యమంత్రి అన్నారు. వరంగల్ నగరాభివృద్ధికి అడిగినన్ని నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వారసత్వ పరంగా వరంగల్ నగరానికి గొప్పపేరుందని గుర్తు చేశారు. సమర్థత ఆధారంగానే బదిలీలు నిర్వహిస్తామన్నారు. రాజకీయ ప్రేరేపిత బదిలీలు ఉండబోవని స్పష్టం చేశారు. అధికారులు భయపడాల్సి అవసరం లేదని, ఎవరి పనివారు చేసుకుంటూ ముందుకు సాగాలని హితవు పలికారు. ప్రస్తుతం తాను సమీక్షను ప్రాథమికంగానే నిర్వహించానని, 45 రోజుల తర్వాత వచ్చి పూర్తి స్థాయిలో మరో సారి సమీక్ష సమావేశం నిర్వహిస్తానని చెప్పారు.

రింగ్‌రోడ్డు భూసేకరణ వేగవంతానికి చర్యలు : పొంగులేటి

రింగ్ రోడ్డు భూసేకరణ వేగవంతానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి అంచనా వ్యయం పెరగడంపై లోతుగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ ఆస్పత్రి ద్వారా వెంటనే వైద్యసేవల అందుబాటులో వచ్చేలా చూస్తామన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మట్లాడుతూ.. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) రూపొందించిన మాస్టర్ ప్లాన్ సరిగా లేదని, మళ్లీ కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. నగరంలోని కొన్ని చోట్ల ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయని, సీఎం దృష్టికి తీసుకువచ్చారు. వీటిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. నగరంలో పేరుకుపోయిన సమస్యలను సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. వరంగల్ సమగ్రాభివృద్ధిని నిరంతరం పర్యవేక్షించడానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకువచ్చారు. రింగ్ రోడ్డు నిర్మాణంతో పాటు జాతీయ రహదారుల అనుసంధానం సాధ్యాసాధ్యాల గురించి వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి మాట్లాడుతూ వరంగల్ నగర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు పాటిస్తామన్నారు. సమీక్ష సమావేశంలో చర్చకు వచ్చిన ప్రతీ అంశాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తామన్నారు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి సత్వరమే చర్యలు తీసుకుంటామని, మామునూరు ఏయిర్ పోర్టు నిర్మాణానికి భూసేకరణ పనులను త్వరలో చేపడతామని చెప్పారు. అనంతరం స్వశక్తి మహిళలకు రూ. 518.71 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి అందజేశారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రామచంద్రునాయక్, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, బండా ప్రకాశ్, ఉమ్మడిజిల్లా ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కెఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, యశస్వినిరెడ్డి , తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్యతో పాటు వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారదాదేవి, ప్రావీణ్య, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే పదవికి గుర్తింపు

డీఐఈవో సన్మాన సభలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



డీఐఈవో ఆంజనేయరాజును సన్మానిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, జూన్ 29: విధుల పట్ల అంకితభావమే పదవికి వన్నె తెస్తుందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న డీఐఈవో కె.ఆంజనేయరాజు, స్టాటిస్టికల్ అధికారి జితేందర్‌కు కలెక్టరేట్‌లో శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో పాటు కలెక్టర్ రిజ్వాన్ బాషా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ అధికారులుగా ఉత్తమ సేవలందించి, ప్రజల మన్ననలు పొందుతూ సహోద్యోగులకు మార్గదర్శకులుగా గుర్తింపు పొందడం మధురానుభూతినిస్తాయన్నారు. ఉద్యోగ విరమణ ఉద్యోగానికే గానీ మనసుకు కాదన్నారు. సమాజ సేవలో పాల్గొని తరించాలని కోరారు.

వ్యాయామమే ఆరోగ్యానికి మూలం



5కే రన్ చేస్తున్న యువకులతో సీఐ

జనగామ రూరల్, జూన్ 29: ప్రతీ రోజు వ్యాయామం చేస్తే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని జనగామ సీఐ రఘుపతి రెడ్డి అన్నారు. వ్యాయామంపై అవగాహన కల్పించేందుకు శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియం నుంచి 10 కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ రోజు వ్యాయాయం చేస్తే అనేక ఆరోగ్య సమస్యల నుంచి బయట పడవచ్చన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఎస్సై సృజన్ కుమార్, కానిస్టేబుళ్లు పోచయ్య, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా బుగులు వేంకటేశ్వరుడి వార కల్యాణం



చిలుపూర్ ఆలయంలో వేంకటేశ్వరుని కల్యాణం జరిపిస్తున్న పూజారులు

చిలుపూర్, జూన్ 29: చిలుపూర్‌గుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి వార కల్యాణాన్ని శనివారం వేడుకగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యుల వేదమంత్రాల మధ్య వేంకటేశ్వర స్వామి - పద్మావతి అమ్మవార్ల కల్యాణ వేడుకలను వైభవంగా ముగించారు. ఈ కార్యక్రమంలో ఈవో లక్ష్మీప్రసన్న, స్వామివారి నిత్యసేవకులు, ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు, సంగోజు మోహనాచారి, రఘురాం, గుళ్ళపల్లి శ్రీనివాస్ - భవాని, ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఇక వీడ్కోలు... ఇదే ఆఖరి భేటీ

- నేడు చివరి మండల సర్వసభ్య సమావేశం
- ఐదేళ్లలో జరిగిన సమావేశాలు 20 మాత్రమే



రఘునాథపల్లి మండల పరిషత్ కార్యాలయం

రఘునాథపల్లి, జూన్ 29: రఘునాథపల్లి మండల పరిషత్ పాలక వర్గం చిట్ట చివరి సర్వసభ్య సమావేశం ఎంపీపీ మేకల వరలక్ష్మి అధ్యక్షతన ఆదివారం నిర్వహిస్తారు. మండల పరిషత్ పాత పాలక వర్గం గడువు జూలై 3తో ముగుస్తోంది. మండల వ్యవస్థ ఏర్పాటు అయ్యాక ఆరో ఎంపీపీగా మేకల వరలక్ష్మి 4 జూలై 2019న బాధ్యతలు చేపట్టారు. ఆమె అధ్యక్షతన ఈ ఐదేళ్లలో 20 మండల సర్వసభ్య సమావేశాలు జరిగాయి. ఆదివారం 21వ సమావేశం నిర్వహిస్తారు. ఇందులో వివిధ శాఖలపై సమీక్షతో పాటు సభ్యులంతా ఆత్మీయంగా వీడ్కోలు పలికే సందర్భం ఆవిష్కృతం కానుంది.

పరిష్కారానికి నోచుకోని సమస్యలు..

గడిచిన ఐదేళ్లలో 20 మండల సర్వసభ్య సమావేశాలు జరిగి ఎన్నో తీర్మానాలు చేసినా ఇంకా అనేక సమస్యలు ఉన్నాయి. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు, ఎస్సీ బాలికల పక్కా వసతి భవన నిర్మాణం, నూతన జీపీలకు పక్కా భవనాలు, పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, ఖిలాషాపురం-మాదారం గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణం అలాగే మిగిలిపోయాయి.

ఇప్పటి వరకు ఆరుగురు ఎంపీపీలు...

మండల వ్యవస్థ ఏర్పడిన తర్వాత 1987లో మొట్ట మొదటి సారి జరిగిన ప్రత్యక్ష ఎన్నికలలో మొదటి ఎంపీపీగా బొల్లం భిక్షపతి ఎన్నికయ్యారు. ఎంపీటీసీల వ్యవస్థ ఏర్పాటు అయ్యాక 1995లో రెండో ఎంపీపీగా మీసాల శ్రీహరి, 2001లో మూడో ఎంపీపీగా బొల్లవల్లి పుష్ప, 2006లో నాలుగో ఎంపీపీగా వైకుమార్ గౌడ్, 2014లో అయిదో ఎంపీపీగా దాసరి అనిత, 2019లో ఆరో ఎంపీపీగా మేకల వరలక్ష్మి ఎన్నికయ్యారు.

నేడు పాలక వర్గానికి వీడ్కోలు..

మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం జరుగనున్న చివరి సమావేశంలో ఎంపీపీ మేకల వరలక్ష్మి, వైస్ ఎంపీపీ గుగులోతు రంగమ్మతో పాటు 13 మంది ఎంపీటీసీలు, ఒక కో-ఆప్షన్ సభ్యుడికి వీడ్కోలు పలుకనున్నారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కానుంది.. ఐదేళ్ల పాటు చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు తీపి, చేదు జ్ఞాపకాలను గుర్తు చేసుకోనున్నారు.

సభ్యుల సహకారం అభినందనీయం..

మేకల వరలక్ష్మి, ఎంపీపీ, రఘునాథపల్లి



రఘునాథపల్లి ఎంపీపీగా అందరి సహకారంతో అయిదు సంవత్సరాలు సేవలందించాను. అభివృద్ధిలో అటు అధికారులు ఇటు ప్రజాప్రతినిధులు అందించిన సంపూర్ణ సహకారం అభినందనీయం. సీసీ రోడ్లు, పైపు లైన్లు, సైడు కాలువల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేశాం. ప్రధానంగా హరితహారం, ఇంకుడు గుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించాం. మండల అభివృద్ధి కోసం రాజకీయాలకతీతంగా అందరం కలిసికట్టుగా పని చేశాం.

‘నీట్’ను రద్దు చేయాలి

జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ డిమాండ్



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యాపరిరక్షణ కమిటీ నాయకులు

జనగామ కల్చరల్, జూన్ 29: వైద్య విద్యకు సంబంధించిన జాతీయ అర్హత పరీక్ష (నీట్)తో పాటు దానిని నిర్వహించిన ‘ఎన్‌టీఏ’ సంస్థను వెంటనే రద్దు చేయాలని జనగామ జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర బాధ్యుడు డి.శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.లక్ష్మయ్య, బత్తిని చొక్కయ్య మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో పరీక్ష అనేది మూలస్తంభమని, అది విశ్వసనీయతను కోల్పోతే మొత్తం విద్యా వ్యవస్థ కుప్పకూలుతుందని అన్నారు. ప్రస్తుతం ‘నీట్’ విశ్వసనీయతను కోల్పోయిందని, 23 లక్షల మంది విద్యార్థులు ఏళ్ల తరబడి కష్టపడి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ పరీక్ష రాశారని, వారి శ్రమ బూడిదలో పోసిన పన్నీరు లాగా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పేపర్లు లీక్ చేసి అమ్ముకున్నారని, జవాబులు రాయని 50వేల మంది విద్యార్థులకు ఎన్‌టీఏ అధికారులు మార్కులు ఇచ్చారని, ఫలితంగా ఎన్నడూ లేని విధంగా 67 మంది విద్యార్థులకు మొదటి ర్యాంకు వచ్చిందని అన్నారు. ఇదే ‘ఎన్‌టీఏ’ సంస్థ సెంట్రల్ యూనివర్సిటీలలో ప్రవేశం కోసం ‘నెట్’ పరీక్ష నిర్వహిస్తుందని, అక్కడ కూడా పేపర్లను అమ్ముకున్నారని ఆరోపించారు. నీట్, యూజీసీ-నెట్ పరీక్షలలో అవకతవకలకు పాల్పడిన ఎన్‌టీఏ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, నీట్, సీయూ సెట్, నెట్ లాంటి కేంద్రీకృత పరీక్షలను రద్దు చేసి ఇంతకు ముందు ఉన్నట్లుగా వాటి నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు, యూనివర్సిటీలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కేంద్రీకృత పరీక్ష విధానాలకు కారణమైన జాతీయ విద్యా విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం తిరస్కరించి రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఒక విద్యా విధానాన్ని తయారు చేయాలని, నీట్, నెట్ అవకతవకలపై సీబీఐ తో కాకుండా సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో జ్యుడీషియల్ కమిటీ వేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏవోకు అందించారు. కార్యక్రమంలో నల్లనాగుల రాజు, దివాకర్‌రెడ్డి, రాజారెడ్డి, ఎం.లక్ష్మణ్‌జీ, వసంత, ఉమాదేవి, శ్రీనివాసచారి, ఆంజనేయచారి తదితరులు పాల్గొన్నారు.

హైనా దాడిలో దూడ మృతి



మృతి చెందిన గేదె దూడ

బచ్చన్నపేట, జూన్ 29: బచ్చన్నపేట, ఆలీంపూర్ రోడ్డు వెంట ఉన్న వ్యవసాయ బావి వద్ద హైనా దాడిలో దూడ చనిపోయింది. శుక్రవారం రాత్రి పశువులను కట్టేసి వచ్చానని, శనివారం ఉదయం వెళ్లి చూసే సరికి దూడ చనిపోయి ఉందని బాధిత రైతు లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. చనిపోయిన దూడవిలువ రూ.40 వేలు ఉంటుందని అన్నారు. కాగా మండలంలో కొంత కాలంగా హైనాదాడులు లేక పోగా ప్రశాంతంగా ఉన్న రైతులు ఈ ఘటనతో ఆందోళనకు గురవుతున్నారు.

సామాజిక న్యాయవేదికలో గట్టయ్యకు స్థానం



చిలుపూర్, జూన్ 29 : సామాజిక న్యాయవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన సాదం గట్టయ్య యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు యేషబోయిన సాంబయ్య యాదవ్ శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా సాదం గట్టయ్య యాదవ్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలుపడంతో పాటు, పేద ప్రజల సమస్యల పట్ల పోరాడతానని అన్నారు.

పింఛన్ పెంచాలంటూ నిరసన

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 29: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌ను పెంచి ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సముద్రాల గ్రామంలో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, గీత, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు జీపీ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి ఈగ చక్రపాణి మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్‌ను రూ.6వేలు చేస్తామని, మిగితా పింఛన్‌లను రూ.4వేలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు.

సీఎం సోదరుడిని కలిసిన ‘కొమ్మూరి’

జనగామ కల్చరల్, జూన్ 29: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డిని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తనయుడు ప్రశాంత్‌రెడ్డి, కలుసుకున్నారు. శనివారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆయన వెంట జనగామ పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

కొడకండ్ల, జూన్ 29 : మండలంలోని పాకాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు వల్లపు వెంకట్‌రెడ్డి తల్లి రత్నమ్మ, నీలిబండ తండాకు చెందిన భూక్యా రవీందర్ సోదరుడు సీతారామ్ శనివారం అనారోగ్య కారణాలతో మృతిచెందారు. విషయం తెలిసిన పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ వారి ఇళ్లకు వెళ్ళి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాలను మసురం రవీందర్, హేమాని, రామ్, సూరానాయక్, బాలాజీ, రాజారాం, భాస్కర్, సుమన్ తదితరులు పరామర్శించారు.

సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా

పాలకుర్తి, జూన్ 29: మండలంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి అన్నారు. శనివారం వారు దర్దెపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో విద్యుత్ లూజ్ లైన్ల వల్ల ఇండ్లపై తీగలు అనుకోవడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. గ్రామంలో వీధులన్నీ కలియ తిరిగి సమస్యలను తెలుసుకున్నామన్నారు. సమావేశంలో మాజీ సర్పంచులు జలగం కుమారస్వామి, మంద సోమయ్య, భూండ్ల దండయ్య, రాంచంద్రం, సోమయ్య, నరేష్ పాల్గొన్నారు.

ఒడిషా సీఎంను కలిసిన వాస్విక్ చైర్మన్ నరేష్‌కుమార్

బచ్చన్నపేట, జూన్ 29: వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్, మండలంలోని కట్కూరు గ్రామానికి చెందిన నిడిగొండ నరేష్‌కుమార్ శనివారం ఒడిషా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీని భువనేశ్వర్‌లోని ఆయన నివాసంలో కలిశారు. గతంలో ఉన్న పరిచయాలతో పలు విషయాలపై చర్చించారు. వాస్విక్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలను సీఎం తెలుసుకుని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

బాధితులకు ఆర్థిక సహాయం

బచ్చన్నపేట, జూన్ 29: మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన బందారం అంజమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, ఆ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జంగిటి విద్యానాథ్ శనివారం రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట బందారం క్రాంతి కుమార్, జ్యోతి ఉమాపతి, శివయ్య, ధనంజయ, భద్రయ్య, నరసమ్మ, మల్లయ్య, సుదర్శన్ ఉన్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

స్టేషన్‌ఘన్‌పూర్ సీడీపీవో ఫ్లొరెన్స్



నర్మెటలో పిల్లల ఎత్తు, బరువు నమోదు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

జఫర్‌గడ్, జూన్ 29: అంగన్‌వాడీల్లో చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ సీడీపీవో ఫ్లొరెన్స్ టీచర్లకు సూచించారు. అంగన్‌వాడీ టీచర్లచే శనివారం ఆరోగ్యమేళా పేరుతో జఫర్‌గడ్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీడీవో సుమన్, సూపర్‌వైజర్ అనిత హాజరయ్యారు. సమావేశంలో సీడీపీఓ ఫ్లొరెన్స్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ప్రతీ వారం పిల్లల బరువును లెక్కిస్తూ రికార్డుల్లో నమోదు చేయాల న్నారు. పిల్లల నమోదు సంఖ్యను పెంచాలన్నారు. వారికి ఆటపాటలతో నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. సమావేశంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారం..

నర్మెట, జూన్ 29 : పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో సరైన ఆహారం అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.సునితదేవి తెలిపారు. శనివారం నర్మెట మండలకేంద్రంలో ఆరోగ్యమేళా నిర్వహించారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు బరువు, ఎత్తు చెక్ చేసి రికార్డుల్లో నమోదు చేశారు.

ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సునితదేవి మాట్లాడుతూ పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్ వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తోందన్నారు. పిల్లలు వయసుకు తగిన ఎత్తు, బరువు ఉన్నారా లేదా అని చెక్ చేసి పిల్లలకు సంబంధించిన ప్రత్యేక హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తున్నామన్నారు. పిల్లల హెల్త్ ప్రొఫైల్ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. పిల్లల ఆరోగ్యం, వారి పెరుగుదలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు శోభ, విజయలక్ష్మి, స్వరూపరాణి, సృజన, రజిత, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అడుగు తీయలేం.. వేయలేం

సముద్రాల గ్రామంలో అధ్వానంగా తయారైన అంతర్గత రోడ్లు



బురదమయమైన శ్మశానవాటికకు వెళ్లే రోడ్డు



అధ్వానంగా గోపాలపురం రోడ్డు

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 29: మండలంలోని సముద్రాల గ్రామంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. ప్రాథమిక పాఠశాల సమీపంలో రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. పూర్తిగా బురుదకూపంగా మారడంతో పాఠశాలకు వచ్చే చిన్నారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నుంచి శ్మశానవాటిక, గోపాలపురం వెళ్లే రోడ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అడుగుతీసి అడుగు పెట్టలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లను చక్కదిద్దాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చిరుజల్లులకే కాలనీలు జలమయం



రఘునాథపల్లిలోని కాలనీలో నిలిచిన వరద నీరు

- పట్టించుకోని ప్రత్యేకాధికారులు

రఘునాథపల్లి, జూన్ 29: ఇటీవల కురుస్తున్న చిరుజల్లులకే మండల కేంద్రంలోని పలు కాలనీలు జలమయం అవుతున్నాయి. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పలు కాలనీల్లో సైడు కాలువలు లేకపోవడం, ఉన్నా అవి మట్టితో కూడుకపోవడం తదితర కారణాలతో కాలనీల రోడ్లు వరద నీటితో మునిగిపోతున్న గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు పట్టించుకోవడంలేదు. కొద్దిపాటి వర్షం పడితే చాలు కాలనీలలోని రోడ్లు మోకాళ్ల లోతు వరకు వరద నీటితో నిండిపోతున్నాయి. దీంతో ఇంటి నుంచి బయటకు వెళ్లలేని దుస్థితి నెలకొందని కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగిసి పాలన ప్రత్యేకాధికారుల చేతిలోకి వెళ్లి ఆరు నెలలు గడుస్తున్నా గ్రామ పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రత్యేకాధిరులు స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వరద నీరు నిలవకుండా చూడాలి..

లక్ష్మినారయణ, రఘునాథపల్లి



కాలనీలల్లో రోడ్లపై వరద నీరు నిలువకుండా చర్యలు చేపట్టాలి. ఎప్పటికప్పుడు సైడు కాలువలు శుభ్రం చేసేలా జీపీ సిబ్బంది చూసుకోవాలి. వర్షపు నీరు రోడ్లపై కొన్ని రోజుల పాటు నిలిచి ఉండడం వల్ల దోమలు, ఈగలకు అవాసాలుగా మారే ప్రమాదం ఉంది. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలడానికి అవకాశముంది. అందువల్ల పారిశుధ్య నిర్వహణ లోపం జరగకుండా పంచాయతీ కార్యదర్శి చర్యలు తీసుకోవాలి.

కామన్ స్కూల్ విధానమే మేలు

డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి



రాజేందర్‌ను సన్మానిస్తున్న డీటీఎఫ్ రాష్ట, జిల్లా, మండల ప్రతినిధులు

జఫర్‌గడ్, జూన్ 29: ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే కామన్ స్కూల్ విధానమే మేలని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి అన్నారు. శనివారం కూనూరు జడ్పీ హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడు సీర్లంచ రాజెందర్ ఉద్యోగ విరమణ సందర్భంగా హెచ్‌ఎం పర్వేజ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లింగారెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా ఉన్న వారికి, లేని వారికి ఒకే విధమైన విద్యనందించే కామన్ స్కూల్ పాఠశాలలు దేశానికి ఎంతో అవసరమన్నారు. పాలకులు మొదటి నుంచి పటిష్ట విద్యా విధానానికి తగిన ప్రణాళికలు రూపొందించక పోవడం వల్ల.. నానాటికి ప్రభుత్వ పాఠశాలల పట్ల పిల్లల తల్లిదండ్రులకు చులకన భావం ఏర్పడిందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బాగుపడుతుందని ఎంతో ఆశించారన్నారు. రాష్ట్రంలో కులాల వారీగా గురుకులాలను ఏర్పాటు చేయడం సమాజానికి శ్రేయస్కరం కాదన్నారు. విద్యా వ్యవస్థ పటిష్టతకు పాలకులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పదవీ విరమణ పొందుతున్న రాజెందర్ విద్యార్థుల విద్యా ప్రగతికి, విద్యాభివృద్ధికి విశేష సేవలందించారని ప్రశంసించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దుటలో ఆయన చేసిన కృషిని వక్తలు కొనియాడారు. రాజెందర్ దంపతులను ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

రెవెన్యూ సిబ్బందిపై దాడి సరికాదు



కొడకండ్లలో డీటీకి వినతిపత్రం ఇస్తున్న రెవెన్యూ సిబ్బంది

కొడకండ్ల, జూన్ 29: రెవెన్యూ సిబ్బందిపై దాడులను ఖండిస్తున్నామని స్థానిక సిబ్బంది అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లో ఆర్‌ఐ వెంకట్‌రెడ్డిపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని, సస్పెన్షన్ ఎత్తివేసి ఆయనను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాస్, రవి. దామోదర్, అనిల్, నాగమణి, సోనీ, సత్యప్రకాష్, అరుణ పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్‌ఐ వెంకట్‌రెడ్డిని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి దుర్భాషలాడి సస్పెండ్ చేయించడం దురదృష్టకరమని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్‌ఐలు అర్జున్, రవీందర్ అన్నారు. ఇందుకు నిరసనగా శనివారం డివిజన్ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ సిబ్బంది నిరసన తెలిపారు. అనంతరం డీటీ విజయ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు.

కూలి పెంచాలి.. భూమి పంచాలి

వ్యవసాయ కార్మిక సంఘం నేత సింగార రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

బచ్చన్నపేట, జూన్ 29: కూలి పెంచి, నిరుపేదలకు భూములు పంచాలని వ్యవవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగార రమేశ్ అన్నారు. శనివారం ఇంజ ఎల్లయ్య, కూరపాటి లక్ష్మీ అధ్యక్షతన వ్యకాస మండల రెండవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగునంగా ఉపాధి కూలిరేట్లు రూ.600లకు పెంచాలన్నారు. పనిదినాలు కుటుంబానికి 200 రోజులు అమలు చేయాలన్నారు. అలాగే గోపాల్‌నగర్ వద్ద 174 సర్వే నంబర్‌లో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలిచ్చి, ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల నూతన అధ్యక్షుడిగా ఇంజ ఎల్లయ్యను మరోసారి ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బెల్లం కొండ వెంకటేశ్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్ గుడిసెలు వేసుకున్న ప్రాంతాన్ని సందర్శించి గుడిసెవాసులతో మాట్లాడారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్

బచ్చన్నపేట, జూన్ 29: మండలంలోని కట్కూరు గ్రామానికి చెందిన దూసరి కనకయ్యకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ శనివారం రూ. 2.50 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని అందించారు. కనకయ్య కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకుని మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి ఎల్‌వోసీ మంజూరు చేయించారు. అదేవిధంగా ఇటీవల కాంగ్రెస్ నాయకుడు కుంట్ల కమలాకర్ తండ్రి మరణించటంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మునిని నాగభూషణం ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్‌తో పాటు నాయకులు పుట్ట నర్సింహులు, మహాత్మాచారి, భిక్షపతి ఉన్నారు.